## రైతు నాయకుడికి తుమ్మల, మెచ్చా నివాళి

దమ్మపేట, మార్చి 21: అనారోగ్యంతో మృతిచెందిన రైతు నాయకుడికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నివాళులర్పించారు. మండలంలో నాగుపల్లికి చెందిన రైతు నాయకుడు పొన్నగంటి సూర్యనారాయణ (70) అనారోగ్యంతో బుధవారం రాత్రి ఆయన స్వగృహంలో మరణించారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల, మాజీ ఎమ్మెల్యే మెచ్చా అక్కడికి వెళ్లి అతడి భౌతికయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకుడు దొడ్డాకుల రాజేశ్వరరావు, జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

## గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

భద్రాచలం, మార్చి 21: భద్రాచలం గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణానికి చెందిన తంగెళ్ల శేషంరాజ్ (35) కేటీపీఎస్‌లో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం శేషంరాజ్ బైక్‌పై భద్రాచలం చేరుకున్నాడు. బ్రిడ్జి పక్కన బైక్ నిలిపి క్షణాల్లో నదిలోకి దూకాడు. ఘటనలో శేషంరాజ్ తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై విజయలక్ష్మి, పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద దొరికిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## పాఠశాలకు సమయానికి రాని టీచర్‌పై ఫిర్యాదు

టేకులపల్లి, మార్చి 21: మండలంలోని మొక్కపాడు పంచాయతీ మొక్కంపాడు తండా ప్రైమరీ స్కూల్లో ఓ ఉపాధ్యాయుడు పాఠశాల సమయానికి రాకపోవడంతో గురువారం గ్రామస్తులు హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. మొక్కంపాడు తండా పాఠశాలలో మొత్తం 30 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వారిలో ఒకరికి టెన్త్ పరీక్షల డ్యూటీ పడగా మరో ఉపాధ్యాయుడు పాఠశాల సమయానికి రాలేదు. దీంతో గ్రామస్తులు ఆ ఉపాధ్యాయుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## శెట్టుపల్లిలో గోవిందరాజుల జాతర

గుండాల, మార్చి 21: మండలంలోని శెట్టుపల్లిలో సనప వంశీయుల ఆరాధ్య దైవం గోవింద రాజు జాతర ఈ నెల 22 వరకు జరుగనుంది. సమీప పాండవుల గుట్టనుంచి గురువారం చినగోవిందరాజు, పెద్ద గోవిందరాజును, వనాన్ని తీసుకొచ్చి ఎదురుకొల్లు నిర్వహించారు. డోలీ చప్పుళ్లతో దేవతలను, వనాన్ని తీసుకొస్తుండగా మహిళలు పూనకాలతో ఊగిపోయారు. శుక్రవారం గోవింద రాజును సమీప పాండవుల గుట్టకు తీసుకెళ్లడంతో జాతర ముగుస్తుంది. జాతర సందర్భంగా వాలీబాల్ క్రీడలను నిర్వహించారు.


గోవిందరాజు గద్దెల వద్ద సనప వంశస్తులు

## అట్టహాసంగా పాయం వారి జాతర

ఆళ్లపల్లి, మార్చి 17: ఉమ్మడి మర్కోడు పంచాయతీ నడిమిగూడెంలో పాయం వారి ఇలావేల్పు శ్రీరణాసురుడి జాతరను గురువారం ఆలయ బాధ్యులు నిర్వహించారు. మధ్యాహ్నం రణాసురుడి దేవుడు దేవర గుట్ట నుంచి గిరిజనులు నృత్యాలు, డప్పుచప్పులతో దేవుడి పడగలను గర్భగుడికి తీసుకువచ్చారు. పాయం వారి వంశీయుల ఆరాధ్య దైవమైన రణాసురుణి దేవున్ని భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల నుంచి భక్తులు పాల్గొంటారని సభ్యులు పేర్కొన్నారు.

### ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఇల్లందు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **లోద్ మీన,** C/o : **శంకర్ వయస్సు** : 26 సం||లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : ఇ.నెం. 1-1-95, నెం.2 బస్తీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో జిల్లా సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలోని ఇల్లందు మండలం, ఇల్లందు గ్రామ నెం.2 బస్తీ పరిధిలో ఇ.నెం. 1-1-95, సర్వే నెం. 609 లో 50 చ||గ||లు, **డాక్యుమెంట్ నెం. 118/2023** గల స్థిరాస్తికి హద్దులు : **తూర్పు** : లోద్ లక్ష్మి ఇల్లు, **పడమర** : లోద్ సత్యనారాయణ ఇల్లు, **ఉత్తరం** : రోడ్డు, **దక్షిణం** : Nill.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

### PUBLIC NOTICE

Under the instructions of my client M/S Shriram Finance Ltd, **Palvancha Branch** Rep. by its Branch Manager it is stated that **Thodeti Santhosh,** S/o. Thodeti Nagaiah, aged : 24 years; Occ: Business, R/o. 1-16/1/A, Tekulacheruvu Village, Burgampad Mandal, Bhadradri Kothagudem District, is creating mortgage againest his property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client within 5 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

**PROPERTY TO BE MORTGAGED**

ACC Roofed house with a plinth area of 400 Sq.feet; brearing H.No. 1-16/1/A along with its house site to an extant of 242 Sq.yards situated at Tekulacheurvu village, H/o. Burgampadu village, Burgampad Mandal, Bhadradi Kothagudem District bounded by: **East:** Grampanchayath Road 41'0", **West:** Shed of Pandavula Bixam 44'0", **North:** House of Pandavula Achaiah 52'0", **South:** House of Pandavula Upendra 50'6"

Kothagudem
Dt: 21-03-2024

**P. GANESH BABU**
ADVOCATE, KOTHAGUDEM
Cell: 9849246278

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**CHANGE OF NAME**

★ **I, SHAIK NOORJHAN, R/o. 5-2-244/9/1,** Mustafa Nagar, Khammam Urban, Khammam, TS-507 001. Changed My Name as SHAIK NOOR JAHAN, W/o. Shaik Jabbar.
**NT-328434**

★ **I, CHARISHMA ADAPA, R/o. 8-136/4, Main Road,** Bhadrachalam Rd., Aswaraopeta, Bhadradri Kothagudem-507 301, TS. Changed My Name as CHARISHMA KANCHARLA, W/o. Abhinay Kancharla.
**NT-328434**

★ **I, JYOTHI KANCHARALA, R/o. 8-136/4, Main** Road, Bhadrachalam Rd., Aswaraopeta, Bhadradri Kothagudem-507 301, TS. Changed My Name as JYOTHI KANCHARLA, W/o. Satyanarayana Kancharla.
**NT-328434**

★ **I, SATYANARAYANA KANCHARALA, R/o. 8-136/4,** Main Road, Bhadrachalam Rd., Aswaraopeta, Bhadradri Kothagudem-507 301. Changed My Name as SATYANARAYANA KANCHARLA, S/o. Pulla Rao Kancharla.
**NT-328434**

**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి**

**కడిమి సువర్ణ బేబీ,** W/o. **జాకబ్ రమేష్,** నివాసం : ఇ.నెం. 5-5-189/203/1/A & H No 5-5-189/203, ముస్తఫానగర్, పెట్రోల్‌బంక్ దగ్గర, ఖమ్మం జిల్లా అను నేను మామునూరు జిరాక్స్ సెంటర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ (**డాక్యుమెంట్ నెం.** 3596/2009) పోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
**Cell: 6300672783**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616



మణుగూరు టౌన్, పినపాక: ప్రపంచ అటవీ దినోత్సవ ర్యాలీలు నిర్వహిస్తున్న మణుగూరు, పినపాక అటవీ శాఖల అధికారులు, సిబ్బంది

# అటవీ సంపదను పెంచాలి: కలెక్టర్

### జిల్లా వ్యాప్తంగా ప్రపంచ అటవీ దినోత్సవ ర్యాలీలు

పాల్వంచ రూరల్/ మణుగూరు టౌన్/ పినపాక/ అశ్వారావుపేట, మార్చి 21: జిల్లాలోని అటవీ సంపదను పెంచాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మండలంలోని కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ ఆధ్వర్యంలో డీర్ పార్క్ వద్ద గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రం మొత్తంలోనే ఎక్కువ అటవీప్రాంతం భద్రాద్రి జిల్లాలోనే ఉందని అన్నారు. పోలీస్ శాఖ, ఐటీడీఏ సహకారంతో అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడాలని, పెంచాలని అటవీశాఖకు సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అటవీ-వన్యప్రాణి సంపద రక్షణకు, సిబ్బంది క్షేమానికి తాము ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. డీర్ పార్కులో కలెక్టర్, పీవో, ఎస్పీ మొక్కలను నాటారు. డీఎఫ్‌వో కిష్టాగౌడ్, ఎఫ్‌డీవోలు రామోదర్ రెడ్డి, బాబు, కోటేశ్వరావు, రేంజ్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, నర్సింహారావు పాల్గొన్నారు.


పాల్వంచ రూరల్: కిన్నెరసానిలో వైల్డ్‌లైఫ్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్

**ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు**

ప్లాస్టిక్ వల్ల పర్యావరణం దెబ్బతింటోందని అశ్వారావుపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మురళి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మండలంలోని గోగులపూడి గ్రామ సమీపంలోని గుబ్బలమంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో గురువారం సిబ్బంది శ్రమదానం చేశారు. ప్లాస్టక్, వ్యర్థ పదార్థాలను ఏరి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

**అడవుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**

అడవులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని మణుగూరు ఎఫ్‌ఆర్‌వో ద్వాలియా అన్నారు. ప్రపంచ ఆటవీ దినోత్సవం సందర్భంగా మణుగూరులో గురువారం మోటార్ సైకిల్ ర్యాలీ, మానవ హారం కార్యక్రమాలను చేపట్టారు.

**గురుకుల డిగ్రీ కళాశాలలో..**

మణుగూరులోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (బాలురు) విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ స్వప్నకుమారి కళాశాలలో మొక్కలు నాటి, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు.

**పినపాకలో..**

పినపాక మండలంలోని నిర్వహించిన అటవీ దినోత్సవంలో పినపాక ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజస్విని మాట్లాడారు. అటవీ శాఖ కార్యాలయం నుంచి ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్డు వరకు సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.




అశ్వారావుపేట: అడవిలోని ప్లాస్టిక్‌ను సేకరిస్తున్న అటవీ ఉద్యోగులు, మణుగూరు టౌన్: కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అటవీ అధికారులు

# అంగన్‌వాడీ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలి

### హెల్త్ కన్వర్సేషన్ సమావేశంలో డీడబ్ల్యూవో వేల్పుల విజేత

అశ్వారావుపేట టౌన్/ అశ్వారావుపేట రూరల్/ సారపాక/ ఆళ్లపల్లి, మణుగూరు టౌన్/ అన్నపురెడ్డిపల్లి, మార్చి 21: అంగన్‌వాడీ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని డీడబ్ల్యూవో వేల్పుల విజేత సూచించారు. అప్పుడే లక్ష్యాలను చేరుకోగలుగుతామని అన్నారు. అశ్వారావుపేట పట్టణంలోని రైతువేదికలో గురువారం నిర్వహించిన హెల్త్ కన్వర్సేషన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. సిబ్బంది సమయానుకూలంగా పనిచేయాలని సూచించారు. ఆరోగ్య సిబ్బందితో కలిసి గృహ సందర్శన చేపట్టి పౌష్టికాహార లోప చిన్నారులు, గర్భిణులు, తల్లులు, కిశోర బాలికలకు సరైన పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మిల్లెట్ ఫుడ్ స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల్లో మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు, పక్కా భవనాలు, సమావేశాల వేదికలు, శానిటరీ, స్టేషనరీ సమస్యలను సీడీపీవో రోజారాణి.. డీడబ్ల్యూవో దృష్టికి తీసుకెళ్లారు. కాగా, సమావేశ ప్రారంభానికి ముందు డ్రెస్ కోడ్ పేరుతో కొంత మంది అంగన్‌వాడి టీచర్లను సీడీపీవో బయటకు పంపించిన విషయాన్ని మీడియా ప్రతినిధులు డీడబ్ల్యూవో దృష్టికి తీసుకెళ్లారు. డ్రెస్ కోడ్‌లో భాగంగా నూతన దుస్తులు అందించామని, పాత దుస్తులు కూడా డ్రెస్ కోడ్ కిందకే వస్తాయని అన్నారు. అలాగే, అశ్వారావుపేట మండలంలోని కేశప్పగూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా డీడబ్ల్యూవో విజేత గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు.



హెల్త్ కన్వర్సేరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో వేల్పుల విజేత

**సారపాక, ఆళ్లపల్లి, మణుగూరు, అన్నపురెడ్డిపల్లి కేంద్రాల్లో..**

సారపాక, ఆళ్లపల్లి, మణుగూరు, అన్నపురెడ్డిపల్లిల్లో కూడా ఐసీడీఎస్ అధికారులు గురువారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. బాలింతలు, చిన్నారులకు పోషకాహారాలు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ అధికారులు సక్కుబాయి, విజయకుమారి, జయలక్ష్మి, గంగాజలం, అఫ్జల్‌బేగం, డాక్టర్ రామ్‌దాస్ తదితరులు హాజరయ్యారు.


సారపాకలో..


ఆళ్లపల్లిలో..


అశ్వారావుపేట రూరల్లో..

# 'అత్యవసర' సేవలు నిల్

### కొమరారం పీహెచ్‌సీలో అందుబాటులో లేని అంబులెన్స్ వాహనం

ఇల్లెందు రూరల్, మార్చి 21: మండలంలోని కొమరారం పీహెచ్‌సీలో శాశ్వత 108 అంబులెన్స్ లేకపోవడంతో పంచాయతీతోపాటూ చుట్టుపక్కల గ్రామీణ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినా, ఎవరికైనా అనారోగ్యం వచ్చినా అత్యవసర సమయంలో ఆదుకునేందుకు పీహెచ్‌సీకి 108 లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి అత్యవసర చికిత్స నిమిత్తం పెద్దాసుపత్రులకు తరలించాలంటే కత్తి మీద సాము అవుతోంది. గర్భిణులను, ప్రమాదాల్లో గాయపడిన వారిని పట్టణ ప్రాంతాల ఆసుపత్రులకు తరలించేందుకు 108లే కీలకం. వాటిల్లోనే సురక్షితంగా వైద్యశాలలకు చేరవేస్తారనే నమ్మకం. కొన్నిసార్లు అంబులెన్స్ రాకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలపై ఆధారపడుతున్నారు. వారు అవసరాన్ని బట్టి డబ్బులను డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ డబ్బులకు వెనుకాడకుండా వెళ్లినా క్షేమంగా వైద్యశాలకు చేరుతామనే నమ్మకం లేకుండా పోతోంది. అదే 108 అంబులెన్స్ వాహనంలో గర్భిణులు వైద్యుల సమక్షంలో పెద్దాసుపత్రికి చేరుకోవచ్చు. ఒకవేళ కాన్పు నొప్పులు తట్టుకోక దారి మధ్యలోనే 108 సిబ్బంది గర్భిణులకు సుఖ ప్రసవాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ ప్రైవేట్ వాహనాల్లో ఆ పరిస్థితి లేదు.



కొమరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

## గూగుల్ పేలో అద్దె పంపుతానంటూ సైబర్ మోసం

అశ్వారావుపేట, మార్చి 21: ఇల్లు అద్దెకు తీసుకుంటానని చెప్పిన ఓ ఒక వ్యక్తి సైబర్ నేరానికి పాల్పడ్డాడు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి శ్రీనివాసరావుకు ఏపీ విజయవాడలో ఇల్లు ఉంది. ఇటీవల ఆ ఇల్లు అద్దెకు ఇస్తానంటూ ఓఎల్‌ఎక్స్‌లో సమాచారం పెట్టాడు. అది చూసిన ఓ వ్యక్తి.. శ్రీనివాసరావుకు కాల్ చేసి తాను ఒక సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగినని, ఆ ఇల్లు తనకు అద్దెకు కావాలని చెప్పాడు. అద్దె వివరాలు అడిగి తెలుసుకున్నాడు. అనంతరం తాను గూగుల్ పే ద్వారా నగదు పంపిస్తానని చెప్పారు. మీరు గూగుల్ పే యాప్ ఓపెన్ చేసి కొన్ని వివరాలు నమోదు చేయాలని సూచించారు. సదరు వ్యక్తి చెప్పినట్లే వివరాలు నమోదు చేస్తుండడంతో శ్రీనివాసరావు ఖాతా నుంచి రూ.19 వేల చొప్పున రెండుసార్లకు కలిపి రూ.38 వేలు కట్ అయ్యాయి. దీంతో వెంటనే బాధితుడు సదరు వ్యక్తికి ఫోన్ చేయగా అది స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసం జరిగిందని గమనించి శ్రీనివాసరావు లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీరాముల శ్రీను తెలిపారు.

## భద్రమ్మ కుటుంబానికి 'రేగా' పరామర్శ

సారపాక, మార్చి 21: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దుప్పటి రమణ మాతృమూర్తి దుప్పటి భద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆమె సంస్మరణ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హాజరై భద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కామిరెడ్డి శ్రీలత, బిక్కసాని శ్రీనివాసరావు, గోపిరెడ్డి రమణారెడ్డి, బాలి శ్రీహరి, బానోత్ శ్రీను, వసంత, యారం వెంకటరెడ్డి, యక్కంటి నరేశ్‌రెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భద్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా

## సోంపల్లిలో 'మన ఇసుక' వాహనం ప్రారంభం

బూర్గంపహాడ్, మార్చి 21: మండలంలోని సోంపల్లిలో 'మన ఇసుక వాహనం' ద్వారా ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ కార్యక్రమాన్ని తహసీల్దార్ ముజాహిద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేస్తున్న నూతన ఇసుక పాలసీ విధానం వల్ల ఇసుక చౌకధరకు లభిస్తుందని పేర్కొన్నారు. తొలుత సోంపల్లిలో ఈ ఇసుక రీచ్‌ను ప్రారంభించామని, ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక రీచ్‌లలో ఇసుక రవాణా చేసేందుకు అవకాశం ఉందని అన్నారు. ఆర్ఐ నర్సింహారావు, ఎస్ఆర్‌వో రాం పాల్గొన్నారు.


మన ఇసుక వాహనాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

## ఆలయానికి విరాళాలు.. విజేతలకు బహుమతులు..

అశ్వారావుపేట రూరల్, మార్చి 21: మండలంలోని వినాయకపురం సీతారామాలయం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. నూతన ఆలయ నిర్మాణం కోసం చేపట్టిన విరాళాల సేకరణలో భాగంగా రూ.500కు పైగా విరాళం అందజేసిన వారికి కూపన్లు పంపిణీ చేశామని తెలిపారు. బుధవారం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూర్తయినందున గురువారం లక్కీ డ్రా నిర్వహించామన్నారు. విరాళాలిచ్చిన వారిలో మొదటి విజేతకు బైక్, రెండో విజేతకు ఎల్‌ఈడీ టీవీ, మూడో విజేతకు గ్రైండర్ అందజేసినట్లు వివరించారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, మార్చి 21: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి కల్యాణం జరిపించారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

## 'రేపట్నుంచి బాలాజీ ఆలయ బ్రహ్మోత్సవాలు'

అన్నపురెడ్డిపల్లి, మార్చి 21: అన్నపురెడ్డిపల్లి శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 23 నుంచి 28 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ కోరారు. స్థానిక ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 25న రాత్రి 10 గంటలకు స్వామివారి తిరుకల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

## దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 'సతీశ్'

దమ్మపేట, మార్చి 21: నూతనంగా ప్రారంభమైన దమ్మపేట కోర్టులో బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ తొలి అధ్యక్షుడిగా మారం సతీశ్‌కుమార్ బాబు, ఉపాధ్యక్షుడిగా శ్యామ్‌సుందర్, ప్రధాన కార్యదర్శిగా గొంది మురళిమోహన్, పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

## ప్రముఖ వైద్యుడు తిరుపతిరావు మృతి

మణుగూరు టౌన్, మార్చి 21: మణుగూరుకు చెందిన ప్రముఖ సీనియర్ వైద్యుడు తిరుపతిరావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. 30 ఏళ్లుగా మణుగూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యసేవలు అందించారు. తిరుపతిరావు మృతి పట్ల పట్టణ ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## 24న బ్రిలియంట్‌లో జిల్లాస్థాయి మోడల్ పరీక్ష

సారపాక, మార్చి 24: సారపాకలోని బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి ఎంసెట్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ గురువారం తెలిపారు. పూర్తి వివరాలకు 9866283566, 9705137128 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## సింగరేణి సివిల్ సిబ్బంది ఆర్థిక సాయం

మణుగూరు టౌన్, మార్చి 21: మణుగూరు ఏరియా సింగరేణి రైల్వే కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న కుంట రవి రోడ్డు ప్రమాదంలో కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో నడవలేని స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న మణుగూరు ఏరియా సివిల్ ఉద్యోగులు కాంట్రాక్టర్లు రూ.16 వేలు, తోటి కార్మికులు క్వింటా బియం సేకరించారు. వాటిని ఏజీఎం (సివిల్) వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గురువారం రవికి అందజేశారు.

## టెన్త్ పరీక్ష కేంద్రంలో డీఈవో తనిఖీ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 21: పాత కొత్తగూడెంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని డీఈవో వెంకటేశ్వరచారి గురువారం పరిశీలించారు. దాని పక్కనే ఉన్న యూఆర్ఎస్‌ని తనిఖీ చేశారు.

## పాల్వంచ రూరల్ సీడీపీవోగా రేవతి

పాల్వంచ రూరల్, మార్చి 21: ఐసీడీఎస్ పాల్వంచ రూరల్ సీడీపీవోగా రేవతి గురువారం విధుల్లో చేరారు. ఇక్కడి సీడీపీవో కనకదుర్గ బదిలీపై ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం వెళ్లారు. ఆమె స్థానంలో బూర్గంపాడు అసిస్టెంట్ సీడీపీవో రేవతి వచ్చారు.

## క్షయ వ్యాధిపై అవగాహన

కొత్తగూడెం టౌన్, మార్చి 21: స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిలో క్షయ వ్యాధిపై గురువారం అవగాహన సదస్సును సూపరింటెండెంట్ నిర్వహించారు. ఆస్పత్రి వైద సిబ్బందికి ఈ వ్యాధిపై డీటీసీవో డాక్టర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు.

## స్వర్గధామం కమిటీ ఏర్పాటు

పాల్వంచ, మార్చి 21: పాల్వంచ స్వర్గధామం అభివృద్ధి కమిటీ గురువారం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా సాయిని కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గ-కార్యవర్గ సభ్యులుగా మరికొందరు, గౌరవ సలహాదారులుగా ఎన్నికయ్యారు.

## టీఆర్‌వీకేఎస్ నాయకుడికి నివాళి

పాల్వంచ, మార్చి 21: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం అసిస్టెంట్ సెక్రటరీ, కేటీపీఎస్ ఆర్టిజన్ శేషంరాజు (45) మృతిచెందారు. మృతదేహాన్ని సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేష్, నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

## డైరీ ఆవిష్కరణ

కొత్తగూడెం టౌన్, మార్చి 21: తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవాసంఘం డైరీని డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష గురువారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమ్లా నాయక్, కార్యదర్శి రమేష్ బాబు, సభ్యులు రామచందర్, అజయ్ అమ్మని, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి కుర్చీల వితరణ

భద్రాచలం, మార్చి 21: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి గురువారం సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ మహిళా సమితి సభ్యులు 16 కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమితి వైస్ ప్రెసెడెంట్ రేష్మాశర్మ, సమితి సెక్రటరీ ప్రతిభ, అడ్వైజర్లు అంజు తమక్, లక్ష్మీరాంబాబు పాల్గొన్నారు.

## 'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి'


భద్రాచలం, మార్చి 21: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రీన్ భద్రాద్రి సంస్థ అధ్యక్షుడు రాంబాబు పిలుపునిచ్చారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని అభయాంజనేయస్వామి పార్కులో సంస్థ సభ్యులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు సుబ్రహ్మణ్యం, భూపతిరావు, కృష్ణార్జునరావు, డాక్టర్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## అనాథ శవానికి అంత్యక్రియలు

ఇల్లెందు రూరల్, మార్చి 21: అనాథ శవానికి మండలంలోని సీఎస్‌పీ బస్తీ పంచాయతీ కార్మికులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తి భిక్షాటన చేసుకుంటూ ఎన్నో రోజులుగా జీవనం సాగిస్తున్నాడు. అదే ఏరియాలో ఉంటూ ఉదయం తుదిశ్వాస విడవడంతో పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు చేశారు.

## కోడిపందేల్లో పట్టుబడితే కఠిన చర్యలు: ఎస్సై

అశ్వారావుపేట, మార్చి 21: కోడి పందేల్లో పాల్గొని పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీరాముల శ్రీను జూదరులను హెచ్చరించారు. పట్టణానికి చెందిన పలువురు జూదరులకు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఎదుట గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. కోడిపందేలు నిర్వహించడం, వాటిలో జూదం ఆడడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. అనంతరం జూదరులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. తరువాత తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఎదుట హాజరు పరచగా సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.


జూదరులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై శ్రీను